

మోకాళ్ళ మీద గడ్డంఆన్చి, క్రిందికి చూస్తూ కూర్చుంది సుమిత్ర. క్రింద గడ్డికొనలమీద తడిమెరుస్తోంది. దూరాన చిన్న నీలంపూలు గాలికి ఊగుతున్నాయి. గాలికి చెట్టునుంచి కనకాంబరం రంగు గొట్టం పువ్వొకటి రాలి క్రిందపడింది. బరువుగా నిట్టూర్పు వదిలింది సుమిత్ర.

పుస్తకంలోంచి తలెత్తి చూసింది వసుంధర. "ఏమిటది? ఇందాకట్నించి చూస్తున్నావు?" అన్నది.

సుమిత్ర మాట్లాడలేదు. దూరానవున్న చెట్లకొనలమీద స్వర్ణారుణ కాంతితో సూర్యకిరణాలు ప్రసరిస్తున్నాయి. అంతా నిశ్శబ్దంగా వున్నది.

"హాస్టల్లో చేరి చదువుకునే ఆడపిల్లలంతా యీ గార్డెన్సులో కూచుని, నిట్టూర్పులు విడవటానికికాదు యింతఅందంగా యీ తోట వేసింది–తెలుసా?" అన్నది వసుంధర.

ఎంతో ప్రశాంతంగా వున్నది వాతావరణం. తీయనిశోభ గోచరిస్తోంది చుట్టూ ప్రకృతిలో. దూరాన హాస్టలు బ్లాకుల్లోంచి ఏవో యింగ్లీషుపాటలు వినిపిస్తున్నాయి. మధ్యమధ్య కీచుమని కేకలు, పకపక నవ్వులు వినిపిస్తున్నాయి.

సుమిత్ర మళ్ళీ నిట్టూర్చింది. వసుంధర పుస్తకం మూసేసి ప్రక్కన పడేసింది. "ఏమిటా వేదన? చెప్పమంటుంటే?" అన్నది. సుమిత్ర మనస్థితి విరబూసిన పారిజాత వృక్షంలా వున్నది. కదిలిస్తే జలజలా రాలుతాయి పుష్పాలు. ప్రకృతి మాధుర్యానికి మనస్సు కంపిస్తోంది. తనలోని ఆలోచనలన్నీ ఏదోవిధంగా చెప్పుకోవాలనీ, ఆర్ద్రతని విరజిమ్మాలనీ అనిపిస్తోంది.

"నీకెప్పుడైనా పెన్‌ఫ్రెండ్స్ అంటూ వున్నారా?" అన్నది సుమిత్ర.

"నాకు గిట్టవు అలాంటివి. ఏం, నీకు కావాలా యిప్పుడు?" అన్నది వసుంధర. "ఒకవయస్సులో అది చాలా రొమాంటిక్ గా కనుపిస్తుంది. 16–20 సంవత్సరాలమధ్య–కాదూ."

"కాదు కాదు–ఇంతకీ దేనికీ ఉపోద్ఘాతం?" సుమిత్రకళ్ళు సగం మూసుకుని చూస్తోంది. "జీవితంలో ప్రతి వ్యక్తికీ యితరులకి కొంత ఆనందం, కొంతదుఃఖం కలిగించే అవకాశాలుంటాయి. అవి మనం ఉపయోగించు కోవడంలో వుంటుంది నేర్పు."

వసుంధరకి సుమిత్రకళ్ళు ఆర్ద్రంగా మెరుస్తున్నాయా అని అనుమానం కలిగింది. క్రింద పడిన పచ్చపూవుని పట్టుకున్న ఆమె వ్రేళ్ళు వణుకుతున్నాయా అనిపించింది– వసుంధర మౌనంగా ఊరుకున్నది. ఈ ఏణ్ణర్థం పరిచయంలో రెండు మూడుసార్లుకూడా చూడలేదు యీ మూడ్‌లో సుమిత్రని. ఒక రూములో వుంటూ, ఒకేసారి కాలేజికి వెడుతూ రిసెర్చి చేస్తున్నారు. ఇరవైనాలుగంటలూ యిద్దరూ కలిసే వుంటున్నారు—

కానీ యిల్లాంటి మూడ్స్‌లో సుమిత్ర పడివప్పుడు వసుంధరకి ఆమె అర్థం కాదు. ఏమీ చెప్పదు, బిగ్గరగా ఏడిచేసి బాధ పైకి తీర్చుకోదు. ఏదో ఒక పరమసత్యాన్ని లోక సామాన్యంగా చెప్పి, దాన్ని గురించే బాధపడుతున్నట్లు కనిపిస్తుంది. ఆమెచేత మాట పలికించడం అసంభవం.

కానీ—యీనాటి వాతావరణం భిన్నంగా వుంది. చుట్టూవున్న అందం, తమని అంటకుండా దూరందూరంగా జరుగుతున్న ధ్వనులు, మూగగా ఆనందాన్ని విరజిమ్ముతూన్న పూలు, పిట్టలు, చెట్లు—వీటన్నిటిమధ్య తామిద్దరే ఏదో ఒక సామీప్యాన్ని అనుభవిస్తున్నారు. కుసుమభరితమైన లతలా వున్నది సుమిత్ర.

"సుమిత్రా, చెప్పు. నేను వినడానికి సిద్ధంగా వున్నాను." అన్నది వసుంధర. సుమిత్ర క్రిందకివాలి గడ్డిమీద పడుకుంది. వసుంధర ఆమె తలనుతీసి, తన ఒళ్లో వుంచుకుంది. "చెప్పు మరి" అన్నదామె.

"నేను యింటరులో వుండగా పెన్ ఫ్రెండ్స్ సంఘంలో చేరాను—అంటే ఏడేళ్ళ క్రితం అన్నమాట. దూరదూరాల్నుంచి వచ్చే వుత్తరాలు, కలిగే పరిచయాలు, అవి కొని తెచ్చే స్నేహపరిమళాలు నా మనస్సులో నిత్యం మెరుగులు దిద్దేవి. ఎక్కువమంది మగవాళ్ళే వ్రాసేవారు నాకు. లక్నోనుంచి ఒక తను-సంగీతం నేర్చుకునే అబ్బాయి, మద్రాసునుంచి ఒక అయ్యంగార్ల అబ్బాయి, స్పోర్ట్స్‌మేన్, హైదరాబాదులో ఒక యం. ఏ. స్టూడెంటు—ఎవరో యింకా—తిరుపతినుంచి మరో అమ్మాయి పరిమళ అని—ఇంకా ఎందరో వ్రాస్తుండేవారు. అందరికీ ఏదో ఒక పోజ్ యిస్తూ వ్రాయడం అలవాటు నీకర్థమౌతుంది కదూ ఆవయస్సుకి!

సభ్యుల జాబితాలో వారి యోగ్యతలు—16 సంవత్సరాలు, కవిత్వం, సంగీతం, ఫోటోగ్రఫీ అంటే యిష్టం-అన్నిట్లో ప్రవేశం, యితర ప్రాంతాలోని కాలేజీల గురించి, విద్యార్థులనుగురించి తెలుసుకోవాలని కుతూహలం-యివీ యితరులకు సంబంధించినంతవరకు యితరులకు తెలిసేవి. బాగున్నాయి యివన్నీ మరి.

సువ్వున వాసనవేసే వుత్తరాలు కొన్ని వస్తే—అమ్మ మానీ కేక లేసింది రెండుమూడు సార్లు యీ వ్రాతలన్నీ మానేయమని—కానీ నేను వాళ్ళకి వ్రాయడం మాత్రమే మానేశాను.

రోజు విడిచి రోజు ఉత్తరాలు వచ్చేవి. నేను ఆ రాత్రికి రాత్రే కూర్చుని, కొంచెం కాలేజీ కబుర్లు, కొన్ని ప్రకృతి వర్ణనలు, మానసిక ఆవేశాలు—అన్నీ కలిపి వ్రాసేదాన్ని ప్రణయాత్మకంగా... .."

సుమిత్ర ఆగింది—వసుంధర సుమిత్ర నుదుటిమీద వెంట్రుకలని ఉంగరంగా చుట్టి అల్లా వదిలింది.

"ఇంతకీ పైన చెప్పినవాళ్లలో ఎవరిని ఏరుకోమంటావు నీకథకి?" అనుకోకుండానే చిన్నగా నవ్వుతూ అడిగింది వసుంధర.

"అంత సుఖాంతమైన కథేమీ కాదు వసుంధరా—ఏడాది తిరిగేలోపుగానే అందరికీ వ్రాయడం మానేశాను. నేను మీ ఫోటో పంపండనో, వివాహాన్ని గురించి, వర్ణాంతర, రాష్ట్రేతర వివాహాలనుగురించి మీ అభిప్రాయమేమిటనో, మీవూరు వస్తాము కలుస్తారా అనో" ఇల్లాంటివి వ్రాసేవారు కొందరు. ఇల్లాంటి వాళ్లకి సమాధానం వ్రాయాలనిపించేది కాదు.

వీళ్లందరిలోకీ ముందునుంచి ప్రత్యేకంగా కనుపించాడు ఒకతను—ఈ పూరి అతనే. బెజవాడలో వున్న నాకు యీవూరు చాలా గొప్పగా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. యం. ఏ. చదువుతున్నానని వ్రాశాడు. సాహిత్యంతో బాగా పరిచయమున్నవాడు. అదీకాక, ఏవేవో వర్ణనలు వ్రాసేవాడు



# ★ స్నేహం ★

అతి రమ్యంగా. పత్రికల్లో కథలు చదివినంత ఉత్సాహంగా చదివేదాన్ని మొదట్లో. అప్పుడప్పుడే వికసిస్తున్న ఆలోచనలు నావి. తీయనిమాటలు, రమ్యమైన వర్ణనలు, మధురమైన భావనలు—యిల్లాంటివి ఎక్కడ, ఏ రూపంలో గోచరించినా మనస్సు పులకరించేరోజులవి. ముత్యాల వరుసవంటి అతని అక్షరాలు అంత చక్కని దస్తూరీ ఎక్కడా చూడలేదు నేను. మనస్సుని రంజింపచేసే మాటలతనివి.

అతనితో స్నేహం నాకు అలవాటైంది. మొదట్లో అతన్ని గురించి నిర్వికారంగా ఆలోచించినా, తర్వాత త్వరలో ఏవో వూహాలు మెదిలేవి. విశాలమైన నుదటి మీద దీపం కాంతి మెరుస్తుండగా, చక్కని వ్రేళ్ల మధ్య కలంపుచ్చుకుని వ్రాసే అతని మూర్తి కనుపించేది. నవ్వితే చిన్న గుంటపడే అతని కపోలం, మోచేతుల పైకి మడిచిపెటిన అతని షర్టు, ఆ మెడదగ్గర కనిపించే సౌందర్యం, గుండీ వూడదీసిన అతని లాల్చీ ఇల్లా రకరకాలుగా అప్పుడప్పుడు అతని రూపం కనుపించసాగింది. అతని కళ్లు—ఎంతో ప్రయత్నించిన మీదట వూహించగలిగాను. పొడుగాటి రెప్పల వెంట్రుకలు, సుతిమెత్తగా కనుపించే కనురెప్పలు, నవ్వితే ముడుచుకుపోయే కళ్లు—అవిమాత్రం కనుపించేవి."

సుమిత్ర కంఠం వణుకుతోంది. కళ్ళు గట్టిగా మూసుకుని వసుంధర చేతిని పట్టుకుంది. "ఏమిటో రొమాంటిక్ ఫూల్ ననిపిస్తుంది ఇప్పుడు—ఆ వయస్సు, పరిచయాలు, అవన్నీ అనుభవించేసి మర్చిపోయేవి. వాటి మర్చిపోనిని పర్యవసానాలే జీవితంలో జ్ఞాపకముంటాయి. ఆ పర్యవసానాల నంటిపెటుకున్న సంఘటనలు, మమతలు అన్నీ జ్ఞాపకముంటాయి కాబోలు.

ఉత్తరాల్లో ఎప్పుడూ అతను నా రూపాన్ని గురించి ప్రశ్నించలేదు, అతని రూపాన్ని గురించి వ్రాయలేదు. మూడేళ్లు వ్రాసినా ఉత్తరాలు - ఎన్నడూ ప్రస్తావించే ధైర్యం కలిగిందికాదు. ఏవిధమయిన వ్యక్తిగతవిషయాల ప్రసక్తి ఉండేదికాదు అతను వ్రాసేవాటిల్లో. ఏదో చిన్న చిన్న వ్యాసాలు, చక్కని స్కెచెస్ అతని ఉత్తరాలు. నాకు ఎన్నిసార్లో కుతూహలం కలిగేది ఫోటో పంపండని వ్రాద్దామని. మగవాడు అతనే ఉత్సాహం చూపనిదే నేనెందుకు చూపాలి అని, తమాయించుకునేదాన్ని. ఎంత వద్దనుకున్నా, అతని ఉత్తరం రాగానే మనస్సు ఊయలలూగి, ఆనందంతో పులకరించేది. ప్రతి అక్షరం తేనెలొల్కుతూ కనుపించేది. అర్థరాత్రి నిద్రలేచికూడా చదువుకునేదాన్ని అక్కడక్కడి పంక్తులు.

అతను యం. ఎ. పాస్ అయిపోయాడు. ఒక ఏడాది అవీ ఇవీ ఉద్యోగాలకోసం వెతికి లెక్చరరుగా స్థిరపడ్డాడు. నేను బి. ఎస్ సి. పూర్తిచేసేసరికి మేము ఒకరి నొకరం చూసుకోకుండా, ఆప్యాయమొలికే మాటలు ఒక్కటికూడా వ్రాసుకోకుండా కూడా అతిసన్నిహితమైన స్నేహితులమై పోయాము. నేను అంటీఅంటకుండా భిడియపడుతూ వ్రాయడం నేర్చుకున్నాను. ఊహించుకొన్నకొద్ది అతనికళ్ళే జ్ఞాపకంవస్తుండేవి. అతన్ని చూడడమే తరువాయి, మా స్నేహం లతలల్లుకుని, పుష్పిస్తుందని వూహించుకునేదాన్ని. మెరుపులు మెరిసే నవ్వు అతని కళ్లలో గోచరిస్తుందని వూహించేదాన్ని. ఇదంతా—దేనికింత ప్రాముఖ్య మివ్వాలో తెలియకపోవడంవల్లనే అనుకుంటాను. వన్నలమునున్న పరిమళంవంటేది అతని స్నేహం. ఆ నాలుగేళ్ళ నాజీవితంలో ప్రతివారం పోస్టుమేన్ రాకకి, ప్రతిరోజూ తెల్లవారడానికీ ఒక ప్రాముఖ్యం ఇచ్చాయి అతనిని గురించిన ఆలోచనలు. ప్రొద్దున ఆలస్యంగా నిద్రలేవగానే సూర్యుని కిరణాలు కళ్లని తాకితే—అతనే జ్ఞాపకం వచ్చేవాడు.

కాలేజిలో క్లాసులో పాఠాలు జరుగుతుంటే చుట్టూ వున్న మొగపిల్లలవంక తేరిపార చూసేదాన్ని, ఎక్కడైనా అతని పోలికలు కనిపిస్తాయేమోనని-నవ్వుతా, మరీ పిచ్చిగా వుందికదూ?"

వసుంధర లేదని తలూపింది, "లేదు. చెప్పు" అన్నది.

నిజంగా అదిపిచ్చే- బి. ఎస్ సి. పూర్తి కాగానే హైదరాబాదులో యం. ఎస్.సి. చదువుతున్నాను. మిగిలినచోట్ల దరఖాస్తు చేసినా సీటు రాలేదు కాబట్టి వెంటనే ఒప్పుకున్నాను. ఊరువిడచి మరోచోట ఉండటానికి వెడుతున్నామంటే ఉత్సాహంగా ఉండటం సహజమే కానీ రెపరెపలాడే మనస్సుతో చూడసాగాను అతన్ని కలుసుకోవడంకోసం. నాకు సీటు దొరికిందని వ్రాశాను అతనికి. అతను వేరే ఏదో కాలేజీలో లెక్చరరు అన్న సంగతి మాఅన్నయ్యకి తెలుసు. హైదరాబాదు వెళ్లిన తర్వాత అతన్ని కలుసుకుంటానన్న సంగతి అన్నయ్యకి మాటవరసకి చెప్పినట్లుగా చెప్పాను. వారంవారం వచ్చే అతని ఉత్తరాలని అందరూ గమనిస్తూనేవున్నా. అతి స్నేహంగుకనో చాలా మర్యాదస్తుడిక్రింద జమకట్టేసి, పట్టించుకోవడం మానేశారు. హైదరాబాదుకి బయలుదేరే ముందుకూడా ఎక్క



వగా మాట్లాడలేదు నేను అతన్ని గురించి. ఏమిటో వెనుదీశాను.

నేను అన్నయ్య వచ్చి యిక్కడ హోటల్లో దిగాము.

యూనివర్సిటీకి వెళ్ళడం, ఫీజుకట్టడం. యిక్కడికి వచ్చి హాస్టల్లో సీటు సంపాదించడం, అవీ యివీ కొనుక్కోవడం అన్నీ ఒకవారంలో పూర్తయినాయి. ఈవారం రోజుల్లో ఎన్నో చోట్లు తిరిగాము. బయటకు రావడం తడవు ఎక్కడో అతను కనిపిస్తాడని వెతికేవి నాకళ్ళు. అతను ఎవరని వెతుకుతాను నేను, సిగ్గుపడతాను!

అన్నయ్య వెళ్ళిపోయాడు నన్ని హాస్టల్లో దింపి. అతనికి వ్రాద్దామని సంకల్పం. రాత్రి వ్రాద్దామని ప్రొద్దున్న, తెల్లారిలేచి వ్రాద్దామని రాత్రి వాయిదా వేసేదాన్ని. ఎందుకనో జాప్యం-వ్రాయగనే అతను వస్తాడు. అందుకేనేమో అర్థంకాని జాప్యం చేశాను. ఒకరాత్రి పడుకున్నాను ఎంతకీ నిద్రపట్టలేదు చేయదలచుకున్న పని ఏదో మిగిలిపోయినట్లు. లేచి అతని చిరునామాకి కవరు వ్రాశాను. నేను వచ్చానని మళ్ళీ శనివారం నాడు సాయంత్రం నన్ను చూడ్డానికి రమ్మని. తప్పక వస్తానని వ్రాశాడతను. ఆ జవాబు వచ్చినప్పట్నించి నామనసెంత వర్ణనాతీతం. ఆసాయంత్రాన్ని తలచుకుంటూనే. ఊహలు వేసే మనస్సుతో కాలం గడిపాను.

—వసూ. యింత వింటుంటే నీకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది కదూ? ఏవో వింత వసలు కల్పించుకుని, ఒక ప్రణయాన్ని కొంటున్నా, అందుకై ఆరాటపడ్డానంటావు కదూ? కావచ్చు. మూడేళ్ళక్రితం నాస్థితి అల్లాంటిది మొదటిసారిగా యిల్లువదిలి, ఒంటరిగా వుంటున్నాను. నాఒంటరితనం, అతనిని గురించిన ఊహల్లోని నవ్యత - నా పరిస్థితికి కారణాలనుకుంటాను

అతను రాకని, ఆ సమయంలో నా అలంకరణ, సంభావణ, నన్ను చూసి అతను వివశంగా ప్రవర్తించేది-అతనూహించని సౌందర్యాన్ని అతను నాలో చూసి ఏమనుకునేది - అన్నీ వూహించుకున్నాను. నా వేపు ఆశ్చర్యంతో చూసే అతని కళ్ళని, పలకరించే నా హృదయ స్థితిని తలచుకున్నాను.

శనివారం రానేవచ్చింది. సాయంత్రం నాలుగు నుంచీ నేను వద్దనుకుంటూనే అలంకరించుకున్నాను. పరీక్షకు వెళ్ళే విద్యార్థిలాగా వణుకుతున్నాను.


ఐదుగంటలకి విజిటర్సు చిటీలు పట్టుకు వస్తోంది ఆయా. వరండాలోనే నుంచున్నాను. అతని చిటీ వచ్చింది నల్లనైపోయిన వ్రేళ్లలోకి ఆ చీటిని తీసుకున్నాను. అదేదన్నా రీ, గదిలోకి వెళ్ళి చెప్పులు వేసుకుని, బయటకు వచ్చాను.

(44 వ పేజీ చూడండి)

PAKCO పాకో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్, క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* ఫాస్ట్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు ఆంధ్ర, కర్ణాటక కేరళ రాష్ట్రములకు ఏజంట్లు

Grams: 'LAMP' K. S. SHIVJI & CO., (Estd. 1903)

Phone: 3617 పోస్టు బాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.



సుఖ జీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠరోగనివారిణి

భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ మాత్ర, లేహ్యము.

డా॥ కె. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్ మాయిల్ (P. O.) (N. A. Dt.) S. India.

మీకు నమ్మకమైన నీలగిరి తైలం కావాలంటే

కేమిల్ బ్రాండ్ వాడండి



అది కల్తీలేనిది..

# ★ స్నేహం ★

(27 వ పేజీ తరువాయి)

త్వరత్వరగా వరండాలన్నీ దాటి తోటలోకి వచ్చాను. ఆ తోటదాటి, పెద్ద మామిడిచెట్ల క్రిందనుంచి పరుగులెత్తాను. విజిటర్స్ రూమ్ చేరేసరికి ఆయాస పడుతున్నాను.

ఎంత గుంపులో వున్నా అతన్ని గుర్తు పడతానని ధైర్యం—గుర్తుపట్టలేనేమో నని బెరుకు—తెల్లగా పొడుగ్గా ఒకాయన సూట్‌లో కూర్చుని వున్నాడు. అతనే! ఎంత చక్కని విగ్రహం. చీటీ చేతిలో నలుపుతూ "నమస్కారమండీ?" అన్నాను. అతను తెల్లబోయినట్లు కనబడి, చేతులు జోడించాడు. "ఎంతసేపైంది వచ్చి?" అతనింకా తెల్లబోయాడు. 'మీరు పొరబడుతున్నారు, మిస్' అన్నాడు ఇంగ్లీషులో. నేను ఒకడుగు వెనక్కి వేశాను. 'మాధవరావుగారు కారా?' అన్నాను.

'నేనండీ మాధవరావుని—సుమిత్ర గారూ! వెనక్కి తిరిగి చూశాను.'

సుమిత్ర ఆగిపోయింది. వసుంధర ఉత్సుకతని రేకెత్తించడానికని ఆగలేదామె. ఆ సన్నివేశాన్ని చెప్పలేక ఆగింది.

"ఎల్లా వున్నాడతను?" వసుంధర మృదువుగా అడిగింది.

"బాగుండలేదు వసూ, బాగుండలేదు. లోతుకుపోయి, ఎండిబారి సన్నగా గీతల్లాగా వున్న అతని కళ్లు, కళ్ల క్రింద నల్లని గుంటలూ, స్ఫోటకం కావచ్చు. సన్నగా, బాగా నల్లగా, పొడుగ్గా వున్నాడతను. కరుకుగా వుంది అతని ముఖం. వికారంగా వుంది అతని ముక్కు—

అతని కళ్లు—అవి చూసి బావురుమని ఏడవాలనిపించింది వసూ.

"నమస్కారమండీ" అన్నాడతను చిరునవ్వుతో. అతను నన్ను చూసి చాలా హర్షపులకితుడైనాడు. అతని ముఖంలో చూపుల్లో కనిపిస్తోంది ఆ విషయం స్పష్టంగా. నా పెదవులు సన్నగా కదిలాయి. నా చేతిలోని చీటీ క్రిందికి జారవిడిచి, సిమెంటు బెంచీ వేపు చూశాను. మరుక్షణంలో నే క్రిం[illegible]డి చూపించి 'ఇల్లా కూర్చోండి' అన్నాను అస్పష్టంగా. అతను జేబులోంచి రుమాలుతీసి పరుచుకుని కూర్చున్నాడు. నేను చెప్పులు విడిచి కూర్చున్నాను. అతనివంక కళ్ళెత్తి చూడలేకపోతున్నాను.

"వచ్చేముందు వ్రాయలేదేం నాకు?" అతని కంఠం గంభీరంగా వుంది. ఏదో చనువు వినిపిస్తోంది ఆస్వరంలో.

"వ్రాయలేదు—మీ ఇల్లు ఎంత దూరం ఇక్కడికి?"

"ఏమంత దూరం కాదు. అతనుగడియారం చూసుకున్నాడు.

అతని చేతులపై బాగా నలుపు అరచేతిలోని తెలుపుకి కాంట్రాసుగా వుంది. వేళ్ళకణుపులు బండగా వున్నాయి.

'మీరు బైటికి రావచ్చునా యీ టైములో?' అన్నాడతను. నేను పరధ్యానంగా గడియారం చూసుకున్నాను. 'రావచ్చు... కానీ' అని ఆగిపోయాను. హాస్టల్లోకి వెళ్ళిపోవాలనిపిస్తోంది అప్పటికే.

'పదండి అలా వెడదాం ఎక్కడికైనా' అంటూ అతను లేచి నుంచున్నాడు. నేను కూడా లేచాను. బయట గేటుదగ్గర చిన్న కారు నిలబడివుంది. ముందుతలుపు తీసి ఎక్కండన్నాడు. వద్దు, వెనక కూర్చుంటానని అననివ్వలేదు నన్ను.... 'ఎక్కండి' అన్నాడు మళ్ళీ. యాంత్రికంగా ఎక్కాను.

నాకు గొంతులో ఏదో వేదనగా వుంది. శరీరమంతా నీరసంతో వ్రాలిపోతోంది. నరాలలోని పటుత్వం ఒక్కసారి సడలి, శక్తులన్నీ నీరసించ పోతున్నాయా అనిపించింది.

కారు బయలుదేరినప్పట్నుంచీ రోడ్డువంకే చూస్తూ కూర్చున్నాను నేను. ఇన్ని సంవత్సరాల తర్వాత మనం కలుసుకోవడం చాలా బావుంది నాకు. కాదూ? మీ వూరువచ్చి, మిమ్మల్ని చూసేద్దామని ఎన్నోసార్లు అనిపించినా ఎప్పుడూ కుదరలేదు అన్నాడతను. మధ్యమధ్యను హారన్ మ్రోగిస్తూ అతను కారు సునిశితంగా నడపడం మాత్రమే తెలుస్తోంది నాకు. మెత్తగా జారిపోతుంది సిమెంటు



# ★ స్నేహం ★

రోడ్డుమీద కారు. గాలికి నా ముంగురులు కదులుతున్నాయి. బజార్లన్నీ దాటి నిర్జనంగా వున్న రోడ్డుమీద పోతోంది కారు.

'మనం ఏమేమి ముఖ్యమైన ప్రదేశాలు దాటివచ్చామో తెలుసా? న్యూ మార్కెట్టు హాస్పిటలు, హై కోర్టు, కొంచెందూరాన చార్ మినార్ - ఎప్పుడూ రాలేదా మీరీవేపు?' అన్నాడతను.

'లేదు.' అన్నాను నేను. మరి కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది. ఎక్కడో వూరిబయటకు వెడుతున్నామని తెలుసు నాకు.

'యూనివర్సిటీకి ఒక్కరూ వెళ్లడం అలవాటైందా?' అన్నాడతను. తలూపాను. 'క్లాసులు జరుగుతున్నాయా?' అన్నాడు. తలూపాను.

పావుగంట తర్వాత బ్రిడ్జి, ఒక చిన్న తోట, పెద్ద చెరువువున్న ఒక ప్రదేశాన్ని చేరాము. బ్రిడ్జి దాటగానే కారు ఆపితలుపు తీశాడతను. కొన్ని మెట్లు క్రిందికిదిగి. అక్కడున్న తోటనిచేరాము. ఎదురుగా ఎన్నో గులాబీలు, చిన్న చిన్న మామిడిచెట్లు, అశోక వృక్షాలు. ఒక చెట్టు క్రింద కూర్చున్నాము.

'ఏమిటింత సైలెంట్ గా వున్నారు? మీకింత కోత్త వుంటుందనుకోలేదు నేను— బాగుండలేదా యిటూరావడం?' అన్నాడతను. నేను ప్రయత్నపూర్వకంగా నవ్వాను. అబ్బే ఏం లేదు' అన్నాను. నా వూహాకి, యీ యధార్థానికి సమన్వయపరచుకుని, ఒక సంబంధం యేర్పరచడానికి ప్రయత్నిస్తోంది నా మనస్సు. చెట్టుకి దోడిగిన మొగ్గ నేడో రేపో దివ్యసుందరసుగంధ పుష్పమై వికసిస్తుందని ఎగురుచూడగా చూస్తూండగా— ఆ మొగ్గ ఎండి రాలిపోయినట్లుంది నా పని.

'మీరు నన్ను గురించి ఏమనుకు నేవారు?' ఎందుకింత వ్యక్తిగతమైన ప్రశ్న వేశావనుకుంటూనే అడిగాను. అతను తేలిగ్గా నవ్వాడు. 'ఏమనుకు నేవాడినా? ఏమో!... కానీ నేను చాలా 'ప్లీజ్' అయ్యాను మిమ్మల్ని చూసి. మిమ్మల్ని చూడగలిగినందుకు నన్ను నేను అభినందించుకున్నాను. మరి మీరు?'

నేను కొంచెం సిగ్గుపడి నవ్వాను. 'నేను కూడాను.' నా ముఖం నేను చెప్పిన మాట వింటుంది. కానీ నా హృదయం మాత్రం హాయిగా నవ్వలేదు. అతని ముఖం మాత్రం సంతోషంతో వికసించింది. యూనివర్సిటీ విషయాలు, లెక్చరర్లను గురించి, వూళ్లో సాహిత్య సంఘాలనుగురించి, నేను చూడవలసిన ప్రదేశాలనుగురించి చెప్పాడతను. అతని కంఠం శ్రావ్యంగా వినిపించడం మానేసింది కాస్సేపు గడచేసరికి. నాలోని వైముఖ్యం అతని కేమీ పట్టినట్లు కనుపించదలేదు.

మాట్లాడుతున్నంతసేపూ నా కళ్ళు, సుదురు చూస్తున్నాడతను. తల వంచుకుని కూర్చున్న దాన్ని మళ్ళీ ఒకసారి నిజం చూసి తెల్సుకుందామన్నట్లు, కళ్ళెత్తి అతనివంక చూశాను. ఏమిటో! మార్దవం లేదు అతని కళ్లలో ఏ మెరుపులూ లేవు... నాకు నచ్చని భావాలేవో వున్నాయి. లోకంలోని విషయాలన్నీ తనకే కావాలన్న దురాశ కనిపిస్తోంది ఆ చూపులో. తన స్వంతమైన వస్తువు వంక చూసుకుంటున్న దర్పము కనిపిస్తోంది. నేను తల వంచేసుకున్నాను.

చీకటిపడేలోపే తిరిగి వచ్చేశాము. 'రేపు యింటికి వెడదాము. వస్తారా?' అన్నాడతను హాస్టలు గేటుదగ్గర. నేను మాట్లాడలేదు. నాకు వెళ్లాలనిలేదు. చికాకు కలుగుతోంది. అతను నాకు వ్రాసిన వుత్తరాలు, నేను అతనికి ఆప్యాయంగా వ్రాసిన వుత్తరాలు అందంగా తేలికైన పూలలా కనుపించాయి. మరుక్షణమే హోరుగాలి లేచి, పూలన్నీ అల్లా ఎగిరిపోయాయి దూరంగా.

'రేపా?' అన్నాను సందిగ్ధంగా.

'ఏం? ఆదివారమేగా! నాలుగింటికి వస్తాను. ఏం?' అన్నాడతను. లాలనగా వుంది అతని ప్రశ్న. నేను తప్పకొనిదీ వీల్లే దన్నట్లుంది అతని వాలకం.

'ఊఁ' అన్నాను. 'గుడ్ నైట్' అని కారెక్కి తలుపు వేసుకున్నాడు. కారు బయలుదేరి వెళ్ళేవరకు అల్లాగే నుంచున్నాను నేను. హాస్టల్లోకి వస్తుంటే-ఆ పెద్ద మామిడిచెట్ల క్రిందనుంచి, గుడ్డిగా వెలిగే దీపాల క్రిందనుంచి వస్తుంటే— నాకు కలలోంచి మేలుకుంటున్నట్లనిపించింది. హఠాత్తుగా ఒక దరిదాపు లేని ఎడారిలో పడవేసినట్లుంది నా పరిస్థితి. ఆ రాత్రి - ఎంతసేపో కరువుతీరా నిశ్శబ్దంగా ఏడ్చాను నాకు కలిగిన నిరాశ, బాధ తగ్గిపోయాయి.

మర్నాడు ఏమీ చేయలేదు. మధ్యాహ్నం నుంచి నాకు మళ్ళీ ఆరాటం ప్రారంభమైంది. ఏమిటి నాకతనితో సంబంధం? ఎందుకు నేను వాళ్ళింటికివెళ్ళాలి? అనిపించింది. మూడున్నరైనా నేను లేచి తయారుకాలేదు. నాలుగు కావస్తున్న కొద్దీ నాకు నీరసం ఎక్కువైంది. ఏమిచేసేందుకు ఓపిక లేకుండా అలా కుర్చీలో వాలిపడుకున్నాను. ఆయా చీటీ పట్టుకువచ్చింది. నేను బద్ధకంగా లేచి చీటీ వెనకాల వ్రాశాను. 'వంట్లో బాగులేదు, క్షమించండి. రాలేను' అని. మరి పావుగంటకి మళ్ళీవచ్చింది ఆయా. మళ్ళీ ఎప్పుడు కలవమంటారు? అన్న ప్రశ్న పట్టుకుని. నేనే ఉత్తరం వ్రాస్తానని సమాధానం వ్రాసి పంపాను. నిర్వికారమైన మనస్సుతో నిద్రపోయాను ఆ రాత్రి. వారం రోజులవరకు ఏమీ వ్రాయలేదు నేను.

తోన్నో సారి యూనివర్సిటీలో తనిచేసి అతను, ఒకమధ్యాహ్నం యూనివర్సిటీలో కనిపించాడు నాకు. నన్ను చూస్తూనే అతని ముఖం నవ్వుతో వికసించింది. 'హల్లో— బాగున్నారా?' అన్నాడు. నేను తలూపాను. 'ఏం, యిల్లావచ్చారు?' అన్నాను.

'మిమ్మల్ని చూద్దామని'— అన్నాడు. 'అబ్బే. మా తమ్ముడికి ఫీజుకట్టాలనివచ్చా... బి. ఎస్ సి లో వున్నాడు—వ్రాస్తానన్నారు వ్రాయలేదేం?' అన్నాడతను—మళ్ళీ.

'మొన్న మంగళవారం వ్రాశాను. అందలేదా?'

'లేదే! ఏమని వ్రాశారు!' అన్నాడతను.

'ఇవాళ్ళ నన్ను చూడ్డానికి రమ్మని వ్రాశాను' అప్రయత్నంగా అనేశాను అబద్ధాలు. పిరికిగా తప్పించుకోవడానికని అనేశాను కానీ— మనస్సు వీటిని అంగీకరిస్తోంది. ఇతనిపట్ల నీకు బాధ్యతఏమిటి అని సమర్థించుకో చూస్తోంది. నువ్వెందుకు సంజాయిషీ చెప్పుకోవాలని ఎగురు తిరిగి ప్రశ్నిస్తోంది హృదయం.

'అరె. సారీ, సాయంత్రం కాలేజిలో ఒకమీటింగువున్నది. మీకు ప్రాక్టికల్సు రెండింటికే కదా? అలావూళ్ళోకివెళ్లి కాఫీ త్రాగేసివద్దాం రండి' అన్నాడతను. దూరాన అతని కారు నిలబెట్టివుంది. మెట్లు దిగబోతూ ఆగాను నేను......అడ్డంగా తలూపాను. 'వద్దు' అన్నాను. కానీ— అతనితోపాటు మెట్లుదిగి క్రిందకివచ్చాను. అతను ఆశ్చర్యపోయాడు ముందు. 'ఏం' అన్నాడు సందేహంగా. అతని ప్రశ్న అంత చొరవగా లేదు. 'ఏం లేదు, వద్దు' అన్నాను అతనివంక చూసి అతనికళ్లల్లో ఏమిటిది అన్న సంశయం వున్నదా అనిపించింది నాకు.

'నేను వెడతాను మరి. తలనొప్పిగావుంది' అని నమస్కారంచేసి, వీలైనంతహాయిగా నవ్వి, వెనక్కి తిరిగి మెట్లుఎక్కి కాలేజిలోకి వెళ్లిపోయాను. అతను ఒక్క నిముషంతర్వాత కారు స్టార్టుచేసి వెళ్లిపోయాడు......'

సుమిత్ర కంఠం రుద్ధమైంది.

"చీకటిపడుతోంది లే" అన్నది వసుంధర. సుమిత్ర కదల్లేదు.

..."తర్వాత వారంరోజులకి ఏదో వూరు వెడుతున్నానని, నెలవరకు రాలేనని ఉత్తరం వ్రాశాడతను. నెలరోజుల తర్వాత నే వ్రాయమన్నాడు నన్ను. ఈలోగా నాకేదయినా సహాయము అవసర ముంటే వాళ్ళ తమ్ముడికి చెప్పమన్నాడు నన్ను ఫోన్‌లో.


నెలదాటినా నేను అతనికి వ్రాయలేదు. ఆ తర్వాత అతనొక్కసారి వచ్చాడుట హాస్టలుకి నేను లేనప్పుడు. వచ్చి వెళ్లాడని

తెలిసికూడా నేను ఏమిటో సంగతి కనుక్కోలేదు. వసూ, నేను చేసుకున్న వూహా లన్నీ కల్లలై పోయాయన్న బాధ ఒక్కటే కాదు నాకు — తానంత వికారంగా వున్నట్టుకూడ అతనికి తెలియదా అనికూడా నాకే బాధ. ఏమిటో కసిగా నా ఆలోచనల్లోంచి అతన్ని తొలగించుకోవడానికి ప్రయత్నించాను. అన్నీ మర్చిపోవడానికి యత్నించాను. అటు యిటు ఆనందంతో చూడవలసిన విశేషాలేమీ లేనట్లుగా సూటిగా సాఫీయైన రోడ్డుమీద నడకలాగా అయింది జీవితం. ఏవో అందమైనవిషయాలు యింకా ముందు ముందు చూస్తానన్న ఉత్సాహం లేదు ఆగమనంలో. నన్నలముకొనిన నిరాశ, హతాశ మెల్లిగా విడిపోసాగాయి.

మొదటి టరమ్ సెలవులకి నేను యింటికి బయలుదేరాను. రైలు సికిందరాబాదు చేరింది. బయటకు తలవుంచి, స్టేషనులోకి చూడసాగాను. బిస్కట్ల బండీవాణ్ని పిలిచి ఒక పాకెట్టు కొన్నాను. రైలు బయలుదేరే వేళైంది. దూరాన్నుంచి జనం పరుగులు పెడుతూ రైలువేపుకి వస్తున్నారు. ప్లాటుఫారం మీదకి చూశాను. చటుక్కున—అతను కనబడ్డాడు. పుస్తకాల షాపుదగ్గర నిల్చుని ఏదో మేగజీను తిరగ వేస్తున్నాడు. అతను తలెత్తిచూశాడు కొద్ది క్షణాల తర్వాత. నన్ను చూడగానే అతని ముఖం ఒక్కసారిగా వికసించింది. నా హృదయం ఝల్లుమన్నది—భయంతో, చీకాకుతో ముడుచుకుపోయింది మనస్సు. నా ముఖంలో నవ్వు రాలేదు. ఎందుకితనితో నేనీ పరిచయాన్ని పొడిగించడం? మనస్సు నిగ్గబట్టుకుని నేను ముఖం ప్రక్కకు తిప్పుకున్నాను.

రైలు కూతపెట్టింది. ఒక్కసారి తలత్రిప్పి అతనేమి చేస్తున్నాడో అని చూశాను నేను. పదిగజాల దూరంలోనే ఉన్నాడతను. అతని కళ్ళు మెరుస్తున్నాయా అనిపించింది. అర్ద్రంగా మిణుకు మిణుకు మంటున్నాయి ఆ కళ్లు—బాధాకరమైన ఒక సత్యాన్ని కనుక్కొని, తీవ్ర వేదన పొందుతున్నట్లుందేమో ఆ చూపు అని యిప్పుడనిపిస్తుంది నాకు.

అతనితో ఉత్తర ప్రత్యుత్తరాలు నా ఇష్టం వచ్చినతీరున నడిపి, నన్ను గురించి, ఏవో ఆశలు కల్పించుకోనిచ్చి—ఆ స్నేహాన్ని నా ఇష్టం వచ్చినట్లు త్రెంపి వేసే అధికారం నా కెవరిచ్చారు? 'నీతో స్నేహం నాకిపుడు బాగుండలేదు. పో' అని విసరి కొట్టేహక్కు నాకు లేదు. వసూ, అవన్నీ ఇప్పుడనుకుంటాను. ఆ ప్లాటుఫారంమీద అతనితో నవ్వు



చిత్రం: జె. సత్యనారాయణ-బిలాస్‌పూర్.

తూ మాట్లాడితే నా సొమ్మేమి పోయింది? నా ఘనత ఏమితగ్గింది? ఒక కీటకాన్ని అవతలకి త్రోసిపారేసి, అది బాధతో గిలగిల లాడుతుంటే, నాకేమీ పట్టనట్లు చూస్తూ ఊరుకున్నాను తోటి మానవుణ్ని అల్లాగే బాధించాను నేను...'

“తర్వాత ఎప్పుడు చూశావు అతన్ని మళ్లీ?” అన్నది వసుంధర. సుమిత్ర వసుంధర వళ్లో తలదాచుకుని బిగ్గరగా ఏడ్చింది. ఎంతసేపుగానో ఆపుకున్న దుఃఖం పొంగి పొర్లుకొచ్చింది.

“లేదు — అందుకే వసూ అన్నాను జీవితంలో ఎవరికైనా మరో వ్యక్తికి ఆనందం కలిగించే అవకాశం ఎప్పుడుగానీ రాదని. ఆవచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవడమే కాదు—అతి క్రూరంగా వేదనకలిగించి, వెనుతిరిగి సవరించుకోలేని అపచారం చేశాను నేను. ఎంతసేపూ నా ఆశలు తల్లక్రిందులవడం, నన్ను గురించిన ఆలోచనలే నాకు తోచాయిగాని—అతనిలో నే నేమి వూహాల కల్పించాను, అతను నన్ను చూసి ఏమనుకున్నాడు. నేను ఆతృతగా అతన్ని చూడ్డానికి పరుగెత్తుకొనివచ్చి, నీవా అన్నట్లు చూసి నప్పుడు అతనెంత అవమానభారంతో క్రుంగి పోయినాడు,—వసూ, నేను చేసినపని ఎంత తప్పు!” సుమిత్ర ఏడుస్తూనేవుంది. వసుంధర కొంచెం ఆగింది. “ఎందుకు సుమిత్రా ఆ యేడుపు? నువ్వేం చేశావని తప్పు? మళ్లీ ఎప్పుడు చూశావు అతన్ని?” అన్నది ఆమె సుమిత్ర తలనిమిరి.

సుమిత్ర మరోక్కసారి బిగ్గరగా ఏడ్చింది. “ఎప్పుడు చూస్తాను? నేను సెలవులంతా అతన్ని గురించి ఆలోచించలేదు. ఇక్కడికి తిరిగివచ్చిన మూడోనాడు పేపరులో పడింది — అతను రెండురోజులు జ్వరంతో తీసుకొని చనిపోయినట్లు... వసూ, నేను నిజంగా పాపం చెయ్యలేదూ? ఆఖరుసారిగానైనా అతన్ని చిరునవ్వుతో పలకరించి ఆ ఆనందాన్ని యిస్తే నిజంగా ఎంత మధురంగా వుండేవి అతని స్మృతులు? నన్ను అహోరాత్రాలు వెన్నాడే బాధ మాత్రమే మిగిలింది నాకు.”

బాగా చీకటి పడేవరకు అల్లాగే కూర్చున్నారిద్దరూ. చుట్టూ ప్రకృతి అంతా కనులకు స్పష్టంగా కనిపించడం మానేసింది. అక్కడొకటీ, యిక్కడొకటీ పక్షులు ఆతృతగా అరుస్తూ, ఎగురుకుంటూ వెళ్లాయి.

“లే సుమిత్రా — లోపలికి పోదాంపద.” అన్నది, వసుంధర. సుమిత్ర లేచి, కళ్లు తుడుచుకుంది, కొంగుతో. వసుంధర మీద ఆనుకొని రూము చేరింది ఆమె. రూములోకి వెళుతూనే మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె.

అప్పుడుగానీ, ఆ తర్వాత ఎన్నో సార్లు దిగాలుగావుండే సాయంత్రాల్లోగానీ సుమిత్ర ఏడ్చినప్పుడు — వసుంధరకి ఏమని ఆమెను అనునయించాలో తోచలేదు.

భూమి త్రవ్వినకొద్దీ వూరుతుంది నీరు— ఎవరేమి చేయగలరు? ఎవరూ తీర్చలేని, ఎవరికివారు తీర్చుకోలేని వ్యథలు కొన్ని వుంటాయి. అవి అంతే. ★